ప్రజాశక్తి
గురువారం 25 మే 2023
5
శ్రీ సత్యసాయి

జగన్న విద్యాదీవెన మెగా చెక్కును అందిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

జగనన్న విద్యా దీవెన సాయం
రూ.25.33 కోట్లు : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో జగనన్న విద్య దీవెన కింద 31,675 మంది విద్యార్థులకు రూ.25.33 కోట్లు లబ్ధి చేకూరిందని కలెక్టర్ అరుణ్ బాబు పేర్కొన్నారు. జగనన్న విద్యాదీవెన పంపిణీ జిల్లా స్థాయి కార్యక్రమాన్ని బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎ.రమణారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ ఓబుళపతి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్, బిసి సంక్షేమ శాఖ అధికారి నిర్మల జ్యోతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు మంజూరు అయిన 25.33 కోట్లను 29,000 మంది విద్యార్థుల తల్లుల ఖాతాలో జమ చేయనున్నట్లు చెప్పారు. ఈ పథకం కింద పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం ప్రతి త్రైమాసానికి ఒకసారి క్రమం తప్పకుండా జమ చేస్తున్నట్లు చెప్పారు. పేద విద్యార్థులు కూడా ఐటిఐ, పాలిటెక్నికల్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ చదివేందుకు ఈ నిధులు ఉపయోగపడతాయన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువులు చదువుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులకు 25.33 కోట్లు మెగా చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మధులత, భవాని శంకర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఐదేళ్లుగా పూర్తవని ఆధునీకరణ..!

- ◆ జిబిసి, మిడ్‌పెన్నార్ సౌత్ పనులు అసంపూర్తి
- ◆ పనుల పూర్తిపై మీనమేషాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో ప్రధాన సాగునీటి వనరుల్లో ఒకటిగానున్న తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ పరిధిలోకి వచ్చే రెండు ప్రధాన కెనాల్ ఆధునీకరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు ప్రారంభమై ఐదేళ్లు కావస్తున్నా అసంపూర్తిగానే ఉన్నాయి. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కారణంగా గత కొంతకాలంగా పనులు ఆగిపోయి ఉన్నాయి. ఇప్పుడు చెల్లింపులు జరిగినా అన్‌సీజన్‌లో ప్రారంభించడానికి కాంట్రాక్టరు ముందుకొచ్చే పరిస్థితులు కనిపించడం లేదు. దీంతో మధ్యలోనే ఆధునీకరణ ఆగింది.

జిబిసి(గుంతకల్లు బ్రాంచ్ కెనాల్)

హెచ్‌ఎల్ఎంసి నుంచి పాల్తూరు వద్ద గుంతకల్లు బ్రాంచ్ కెనాల్‌గా విడిపోయి ఉరవకొండ, గుంతకల్లు నియోజకవర్గాలకు సాగునీటిని అందిస్తుంది. 59.40 కిలోమీటర్లు ఉండే ఈ కాలువ కింద 15,760 ఎకరాల ఆయకట్టు ఉంది. 2.77 టిఎంసిల నీటి కేటాయింపులున్నాయి. ఇది పూర్తిగా దెబ్బతిని ప్రవాహ సామర్థ్యం మేరకు నీటి ప్రవాహం వెళ్లే పరిస్థితుల్లేకపోవడంతో 2016వ సంవత్సరంలో ఈ కాలువ ఆధునీకరించాలని నిర్ణయించి టెండర్లు పిలిచారు. రూ.234.67 కోట్లతో చేపట్టిన ఆధునీకరణ పనులు రూ.188.69 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. అయితే తక్కిన పనులు మధ్యలోనే ఆగిపోయి ఉన్నాయి. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించలేదన్న ఉద్దేశంతో మధ్యలోనే పనులను ఆపారు. ఈ బిల్లులు ఇటీవలి కాలంలో వచ్చాయి. తరువాత జరిగే పనులకు కూడా బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరిగే అవకాశముందన్న ఉద్దేశంతో కాంట్రాక్టర్ పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. అధికారులేమో ఇప్పుడు అన్‌సీజన్ కాబట్టి పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు నోటీసులు అందించారు.

మిడ్‌పెన్నార్ దక్షిణ కాలువదీ అదే స్థితి

మిడ్ పెన్నార్ నుంచి దక్షిణ కాలువ బయలుదేరుతుంది. ఇది కడప జిల్లా వరకు వెలుతుంది. సుమారు 44.44 కిలోమీటర్లు ఈ కాలువ వెలుతుంది. దీని కింద 22,708 ఎకరాల ఆయకట్టు ఉంది. 4.32 టిఎంసిల నీటి కేటాయింపులున్నాయి.

జిల్లాలోనున్న ప్రధాన కాలువల్లో ఇదీ ఒకటి. ఈ కాలువ ఆధునీకరణ కూడా రూ.509.16 కోట్లతో చేపట్టారు. మూడు ప్యాకేజీల్లో చేపట్టిన ఈ పనులు ఇప్పటికి రూ.205.79 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. పెండింగులోనున్న పనుల్లో ప్రధానంగా ఐదు డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం జరగాల్సి ఉంది. కాని మధ్యలోనే ఆగిపోవడంతో డిస్ట్రిబ్యూటరీల నుంచి రైతులకు ఆయకట్టుకు నీరందడంలో సమస్య ఉంది. బిల్లులు పెండింగులో ఉన్నాయని పనులను ఆపి కాంట్రాక్టరు, పనులు పూర్తయినా ఇక తాను చేయలేనని చేతులెత్తేశాడు. క్లోజ్ చేయమని అధికారులకు లేఖను అందజేశారు. అధికారులు ఇప్పటికీ దీనిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

ఆధునీకరణ పూర్తి చేయాలి
చంద్రశేఖర్‌రెడ్డి,
ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి.

జిల్లాలో వర్షాపాతం తక్కువ కాబట్టి ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాల్సి ఉంటుంది. దీనికి కాలువల ఆధునీకరణ పూర్తి చేయాలి. జిల్లాలో ఏ ఒక్క సాగునీటి కాలువ కూడా సక్రమంగా లేదు. పూర్తిగా దెబ్బతిని ఉన్నాయి. అన్నీ కాలువలు కూడా పనులు ప్రారంభమై మధ్యలో ఆగి ఉన్నాయి. దీని వలన రైతులకు సక్రమంగా సాగునీరు అందటం లేదు. పంటల సాగుకు ఉపయోగపడడం లేదు. పైగా నీటి వృథా కూడా ఎక్కువగా ఉంటోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సాగునీటి కాలువల ఆధునీకరణ పూర్తి చేయాలి.

పుట్టపర్తిలో ఆందోళనలపై ఆంక్షలు

ధర్నా చౌక్‌లో మాత్రమే నిరసనలకు అనుమతి : డీఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైం

వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలు, నిరసనలు, ధర్నాలపై పోలీసులు ఆంక్షలు విధించారు. ఇకపై పట్టణంలో కలెక్టరేట్, ఇతర ప్రాంతాల్లో ఎక్కడ కూడా నిరసనలు, ర్యాలీలు చేసేందుకు వీల్లేదంటూ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు పుట్టపర్తి డీఎస్పీ వాసుదేవన్ బుధవారం నాడు ఇందుకు సంబంధించిన వివరాలను విలేకరులకు తెలియజేశారు. ఇక్కపై పుట్టపర్తిలో ఆర్డీవో కార్యాలయం ముందు మాత్రమే ఆందోళనలు చేసేందుకు అనుమతి ఇస్తామని, దానిని ధర్నా చౌక్‌గా ఏర్పాటు చేస్తామన్నారు. కలెక్టరేట్, హనుమాన్ సర్కిల్, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో రాజకీయ పార్టీలు, కుల, ఉద్యోగ, ప్రజా సంఘాలు ఆందోళనలు చేసేందుకు వీల్లేదన్నారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన అనంతరం ఇద్దరు నాయకులను పోలీసుల ఆధ్వర్యంలో కలెక్టర్ లేదా సంబంధిత అధికారులకు వినతిపత్రాలు ఇచ్చేందుకు అనుమతి ఉంటుందన్నారు. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జగనన్న విద్యాకానుకను పరిశీలిస్తున్న కలెక్టర్

గార్మెంట్స్ పరిశ్రమను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పంపిణీకి సిద్ధంగా 'జగనన్న విద్యాకానుక'

కలెక్టర్ పి.అరుణ్ బాబు

ప్రజాశక్తి-పరిగి

పాఠశాలలు పున్ణ ప్రారంభం కాగానే విద్యార్థులకు పంపిణీ చేసేలా జగనన్న విద్యాకానుక స్టాక్ అంతా సిద్ధంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జగనన్న విద్యాకానుక స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. టెస్ట్ బుక్కులు, యూనిఫామ్, బెల్ట్ లు తదితర వాటిని పరిశీలించారు. పాఠశాలకు ఎంత స్టాక్ వచ్చింది అనే వివరాలను ఆరా తీశారు. షూలు, నోట్‌బుక్స్ రావాల్సి ఉందని ఎంఇఒ కలెక్టర్‌కు తెలిపారు. స్టాక్ అంతా రాగానే నిబంధనల ప్రకారం స్కూల్ పాయింట్ల చేర్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

గార్మెంట్స్ పరిశీలన

పరిగి పరిధిలోని నిషా డిజైన్స్ పరిశ్రమ, హిందూపురం పారిశ్రామిక వాడలో ఏపీ ఇంజినీరింగ్స్, పవర్ గేర్ లిమిటెడ్ పరిశ్రమలను కలెక్టర్ పరిశీలించారు. పరిశ్రమలో పనిచేసే కార్మికులు మాస్కులను ధరించాలని, దీని ద్వారా దుమ్ము, దూళి నుంచి రక్షణ లభిస్తుందన్నారు. పరిశ్రమలలో ప్రభుత్వ నిబంధనల మేరకు భద్రత ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఎస్.చాంద్‌బాషా, ఏపీపీసీబీ ఎన్విరాన్మెంటల్ అధికారి శంకర్‌రావు, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్స్‌పెక్టర్ కేశవులు, పరిగి డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీ నరసింహ, ఎంపీడీవో సరస్వతి పాల్గొన్నారు.

రాష్ట్రజాతాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పెనుకొండ

నగర పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 31 తేదీ నుండి జూన్ 9 వరకు హిందూపురం నుంచి నిర్వహించే రాష్ట్ర జాతను జయప్రదం చేయాలని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం నగర పంచాయతీ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్రజాతకు సంబందించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, సిఐటియు సి.రమేష్ మాట్లాడుతూ పట్టణ ప్రాంత ప్రజలకు సేవలు అందిస్తున్న కార్మికులపై పాలకులు చిన్నచూపు చూస్తున్నారన్నారు. 2019 ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతగా అసెంబ్లీలోనూ పాదయాత్రలో జగన్మోహన్ రెడ్డి మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు, కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి వాగ్దానాల వర్షం కురిపించారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత వారికి ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని విమర్శించారు. పర్యావరణాన్ని ప్రజా ఆరోగ్యాన్ని పరీక్షిస్తున్న మున్సిపల్ కార్మికులను ఉద్యోగులను ఆప్కాస్ అనే బానిస వ్యవస్థలో నెట్టివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.కార్మికులు ఉద్యోగులకు ఇచ్చిన హామీల అమలుకై పోరాటానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెడబల్లి బాబా, సిఐటియు మండల కార్యదర్శి బాబావలి, నగర పంచాయతీ కార్మికుల యూనియన్ నాయకులు చిన్న వెంకటేష్ , ముత్యాలు, నరసింహులు, లక్ష్మీదేవి, శాంతమ్మ, గంగరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు, కార్మికులు

నేడు రిలేనిరాహార దీక్ష

ప్రజాశక్తి అమడగూరు

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్ష కార్యక్రమం చేపడుతున్నట్లు కదిరి ప్రభుత్వ ఉద్యోగుల తాలూకా సంఘం అధ్యక్షులు ఫక్రుద్దీన్ తెలిపారు. ఈ రిలే నిరాహార దీక్ష కార్యక్రమానికి కదిరి తాలూకా ప్రభుత్వ ఉద్యోగులతో పాటు శ్రీ సత్యసాయి జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సైతం హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ప్రతి నెల ఒకటో తేదీన జీతభత్యాలు పడే విధంగా చర్యలు తీసుకొని ఉద్యోగస్తులకు రావాల్సిన బకాయిలన్నీ వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు ఆత్మ రెడ్డి, నాగమణి, రామాంజులు, చిన్న ,హేమలత కిష్టప్ప, హరి ప్రసాద్ సభ్యులు పాల్గొన్నారు .

మైనార్టీలపై దాడులను ఆపండి

ప్రజాశక్తి-హిందూపురం

మతం పేరుతో మణిపూర్‌లో మైనార్టీలపై జరుగుతున్న మారణ హోమాన్ని ఆపాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోలన చేసి మైనార్టీలపై జరుగుతున్న దాడులను ఖండించారు. అనంతరం తహశీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నగారా, ఆల్ ఇండియా టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షులు ఉమర్ ఫారూక్ ఖాన్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి, సిపిఐ వినోద్‌కుమార్, వాల్మీకి నాయకులు శివ శంకర్, కాంగ్రెస్ యువజన నాయకులు సంపత్ కుమార్, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు రవికుమార్, బీఎస్పీ నాయకులు నాజిమ్ బాషా, దండోరా నాయకులు ఆంజనేయులు, ఎస్సీ ఎస్టీ నాయకులు రామకష్ణ, పెన్నయ్య, షౌకత్, తౌసీఫ్, మైనారిటీ నాయకులు బిలాల్, అమీన్, నౌషాద్, అబ్దుల్ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అనధికార వ్యాక్సినేషన్‌పై కఠిన చర్యలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్ :

ఎల్లో ఫీవర్ వ్యాక్సినేషన్ ప్రభుత్వపరంగా వేసే కేంద్రాల్లోనే వేయించుకోవాలని అనధికార వ్యాక్సినేషన్ పై కఠిన చర్యలు ఉంటాయని శ్రీ సత్యసాయి జిల్లా వైద్యాధికారి ఎస్‌వి. కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎల్లో ఫీవర్ ఈడిస్, ఈజిప్ట్‌అను ఒక రకమైన వ్యాధి దోమకాటువల్ల వ్యాపిస్తుందని అన్నారు. ఇది భారతదేశంలో సాధారణంగా ఉండదని తెలిపారు. ఇది ఒక రకమైన వైరల్ ఫీవర్ అని ఇది సాధారణంగా ఆఫ్రికా ,అమెరికా, దేశాల్లో ఉంటుందని చెప్పారు. ఆ దేశాలకు వెళ్లాలన్న ఆ దేశాల నుండి మన దేశానికి రావాలన్నా ఎల్లో ఫీవర్ వ్యాక్సినేషన్ తప్పకుండా వేయించుకోవాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడైనా ఎల్లో ఫీవర్ వ్యాక్సినేషన్ వేస్తారని చెప్పితే అది అనధికారగా వ్యాక్సినేషన్ అయి ఉంటుందని అలా వేసిన వ్యక్తులపై, సంస్థలపై, ప్రభుత్వ, పరంగా కఠినచర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అలాంటివారు జారీ చేసే వాక్సినేషన్ సర్టిఫికెట్లు చెల్లవని ఆయన తెలిపారు. రాష్ట్రంలో విజయవాడ విశాఖపట్నం కేంద్రాల్లో మాత్రమే ప్రభుత్వపరంగా ఈ వ్యాక్సినేషన్ లభిస్తుందని చెప్పారు.

సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ చేతన్

భూసేకరణ పనులు వేగవంతం : జేసీ

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలో వివిధ జాతీయ రహదారులకు రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని తన చాంబరులో భూ సేకరణ పై ఆర్డీవోలు, తహశీల్దార్లు, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు జరిగిన భూ సేకరణ పక్రియ, పెండింగ్ పనులపై జెసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులకు భూ సేకరణ సకాలంలో పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ కొడికొండ చెక్ పోస్ట్, హిందూపురం 544 రహదారి, నేషనల్ హైవే 44 ఇతర రహదారులకు భూ సేకరణ సకాలంలో పూర్తి చేయాలన్నారు. భూ సేకరణ పూర్తి అయితే రహదారులు, రైల్వే పనులు త్వరగతిన పూర్తి చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఆర్డీవో స్థాయి అధికారులు వీటి పైన ప్రత్యేకంగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి, కదిరి ఆర్డీవోలు భాగ్యరేఖ, రాఘవేంద్ర, ఎన్‌హెచ్ అధికారులు, ఆయా మండలాల తహశీల్దార్లు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి - గాండ్లపెంట

తమ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని మండల కేంద్రంలోని చాకలివీధి వాసులు స్థానిక గ్రామ సచివాలయ ఎదుట బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు రంగప్ప, చిన్న రమణ, గౌరీదేవి, రెడ్డమ్మ, చంద్రమ్మ తదితరులు మాట్లాడుతూ దాదాపు సంవత్సరం నుంచి తమ కాలనీలో తాగునీటి సమస్య నెలకొందన్నారు. సమస్యను పలు సార్లు అధికారులకు ప్రజాప్రతినిధులకు తెలిపిన ప్రయోజనం లేదన్నారు. నీరు పుష్కలంగా ఉన్నా పైపులైను సమస్యతో ఇబ్బంది పడుతున్నామన్నారు. గడపగడప మన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లగా స్పందించిన ఆయన వెంటనే సమస్య పరిష్కరించాలని అధికారులకు ఆదేశించిని ఇంతవరకు ఫలితం కన్పించలేదన్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శి రఫీ, సర్పంచి రహమతుల్లా స్పందించి వెంటనే సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు

ఖాళీబిందెలతో రోడ్డుపై బైఠాయించిన కాలనీవాసులు

గెలుపోటములు సమానంగా తీసుకోవాలి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ఏ క్రీడలోనైనా గెలుపోటములను సమానంగా తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల విజయ్‌కుమార్ సూచించారు. పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ధర్మవరం, రాప్తాడు సూపర్ లీగ్ క్రికెట్ టోర్నీ రెండవ ఇన్నింగ్స్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 19వతేదీ నుండి. 28వతేదీ వరకు మొదటి దఫా పోటీలు పూర్తి అయ్యాయన్నారు. ప్రస్తుతం రెండవ దశ పోటీలను ప్రారంభించామన్నారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ఆడాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పణికుమార్, మేకల రామాంజినేయులు, రాంపురం,శీన కేశగాల్ల శ్రీనివాసులు, గంగారపు రవి, ఓంప్రకాశ్. చిన్నూరు విజయ్ చౌదరి,గోసలశ్రీరాములు, చిన్నూరుబాస్కర్ చౌదరి. అమరా, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మ్యాచ్ ను తిలకిస్తున్న టీడీపీ రాష్ట్రకార్యదర్శి గోనుగుంట్ల విజయయ్ కుమార్, తదితరులు

పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలి

చెన్నేకొత్తపల్లి : విద్యుత్ ఛార్జీల రూపంలో ప్రజలపై మోయలేని భారం మోపుతున్న జగన్ తీరుకు వ్యతిరేకంగా మాజీ మంత్రి పరిటాల సునీత నిరసన గళం వినిపించారు. మండలంలోని ఎన్ఎస్.గేటులోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద టీడీపీ నాయకులతో కలసి బుధవారం నిరసన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ రోడ్డు పై బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పరిటాల సునీత మాట్లాడుతూ సిఎం జగన్ 4 ఏళ్ల పాలనలో 7 సార్లు విద్యుత్‌ఛార్జీలు పెంచారన్నారు. ఇప్పటి వరకు ఒక్క విద్యుత్ రూపంలోనే రూ. 57 వేల కోట్లు ప్రజలపై భారం వేశారన్నారు. ట్రూ అప్ ఛార్జీల పేరుతో భారం వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్ల పేరుతో స్మార్ట్‌గా స్కాంలు చేస్తున్నారని ఆరోపించారు. ఓ వైపు విద్యుత్ ఛార్జీలు పెంచడమే కాకుండా విద్యుత్ కోతలు కూడా విధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించి.. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్షతగాత్రుడికి పరామర్శ

రొద్దం : రోడ్డు ప్రమాదంలో గాయపడిన టిఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి సాయికిరణ్‌ను టిడిపి జిల్లా అధ్యక్షులు పార్థసారథి బుధవారం పరామర్శించారు. మండలంలోని చిన్నమంతూరు గ్రామం వద్ద పది రోజుల క్రితం ద్విచక్ర వాహనం అదుపుతప్పిన ప్రమాదంలో సాయికిరణ్ తలకు గాయాలయ్యాయి. దీంతో అనంతపురం సవేరా ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా, విషయం తెలుసుకున్న బికె పార్థసారథి, సతీమణి బికె కమలమ్మ,కుమారుడు బికె సాయి కల్యాణ్, పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షులు ఇసి. హరీష్, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ, రుద్రప్రసాద్ తదితరులు బుధవారం పరామర్శించారు. అదేవిధంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ, సీనియర్ నాయకులు మాధవ నాయుడు, మాజీ ఎంపీపీ నరసింహులు, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి వీరాంజినేయులు, మాజీ ఎంపీటీసీ చెన్నకేశవులు, తిరుపాల్ నాయుడు, పెట్రోల్ బంక్ క్రిష్టప్ప, లింగప్ప, సిద్దన్న,మోహన్, తదితర నాయకులు కూడా సాయికిరణ్‌కు పరామర్శించారు.

జగనన్న లేఅవుట్‌లో వీధిలైట్లు ఏర్పాటు

గోరంట్ల రూరల్ : మండల పరిధిలోని పులేరు పంచాయతీ జీనంవాండ్లపల్లి వద్దనున్న జగనన్న లేఅవుట్‌లో ఆ గ్రామ సర్పంచి తన సొంతనిధులతో వీధిలైట్లు ఏర్పాటు చేశారు. లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న వారు అక్కడే నివాసం ఉంటున్నారు. వారి గృహాలకు మాత్రమే విద్యుత్ సౌకర్యం ఉంది. రాత్రి వేళల్లో బయటకు రావాలంటే వీధిలైట్లు లేనందున చాలా ఇబ్బందిగా ఉందని, రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు, అక్కడ నివాసం ఉంటున్న వారు ప్రయాణం చేసేవారు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు పులేరు పంచాయతీ సర్పంచి ప్రభాకర్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన తన సొంత నిధులతోవీధిలైట్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచికు కాలనీవాసులు కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్. శంకర, మునీర్, పూజారి గోపాల్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

నూతన వంతెన ఏర్పాటుకు విజ్ఞప్తి

బుక్కపట్నం : మండల కేంద్రంలోని నల్లడమ్మ దేవాలయం వద్ద ఎత్తైన నూతన వంతెనను ఏర్పాటు చేయాలని టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం స్థానిక బ్రిడ్జిని పరిశీలించారు. అనంతరం సామకోటి ఆదినారాయణ మాట్లాడుతూ 30 సంవత్సరాల క్రితం చిత్రావతి మరువ పై వంతెన ఏర్పాటు చేశారని అధిక వర్షాలు కురిసినప్పుడు వంతెనపై భారీగా నీరు వెళితే రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని అన్నారు. ఈ రహదారిపై కదిరి, ముదిగుబ్బ తోపాటు గ్రామస్తులు వైద్య సేవలు నిమిత్తం పుట్టపర్తి ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చినప్పుడు వంతెనపై వర్షపు నీరు ప్రవహిస్తే ప్రయాణాలకు ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారు. రాకపోకలు కూడా నిలిచి పోయి ప్రజలు , విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడతారని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నూతన వంతెనను ఏర్పాటు చేసి వంతెన ఎత్తు పెంచాలని కోరారు.

5 బస్తాల విత్తన వేరుశనగ ఇవ్వాలి

గాండ్లపెంట : ఖరీఫ్‌లో పంట సాగు చేసే రైతులకు పంపిణీ చేస్తే సబ్సిడీ విత్తన వేరుశనగను ప్రతి రైతుకూ 5 బస్తాలు ఇవ్వాలని రైతు సంఘం నాయకులు కెకె. రాజారెడ్డి, ఖాదర్‌బాషా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీతో ఇస్తున్న వేరుశనగ విత్తనం కాయలు అర ఎకరాకు ఎకరాకు లేకుండా ప్రతి పాసుబుక్కుకు ఐదు ప్యాకెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు

ఆలయ అభివృద్ధికి విరాళం

అమడగూరు : కదిరి రూరల్ మండలం ముత్యాల చెరువు గ్రామం చిగురు మానుతండాలోని చౌడేశ్వరి దేవి ఆలయ అభివృద్ధికి వైసిపి సిఇసి సభ్యులు శ్రీనివాసరెడ్డి విరాళం అందజేశారు. ఆలయంలో నిర్వహిస్తున్న విగ్రహప్రతిష్టాపన కార్యక్రమానికి హాజరైన ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి తనవంతుగా రూ. 10వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచకపాలన : చిలకం

ధర్మవరం టౌన్ : రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. సేవ్ ధర్మవరం కార్యక్రమంలో భాగంగా పట్టణంలో బుధవారం 25వ వార్డులో ఆయన పర్యటించారు. ఇంటింటికి తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు పలు సమస్యలను చిలకం మధుసూదన్ రెడ్డికి తెచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచకపాలన సాగుతోందన్నారు. ముఖ్యంగా ధర్మవరంలో కబ్జాలు, భూదందాలు అధిక మయ్యాయన్నారు. వీటిని ప్రజలు గమనిస్తున్నారని, రాబోవు ఎన్నికలలో వైసీపీకి ప్రజలు తగిన బుద్ధిచెబుతారన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

హిందూపురం : పట్టణంలోని త్యాగరాజనగర్‌లో గల మార్గదర్శి విద్యానికేతన్ పాఠశాలలో కె. సాయికళ, కె.మాళప్ప ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 25వ ఉచిత వేసవి బడి విద్యార్థులకు ప్రముఖ వ్యాపారి కృపాకర్ రెడ్డి అందించిన రైటింగ్ ప్యాడ్స్‌ను ఈశ్వర్ రెడ్డి చేతుల మీదుగా బుధవారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు మార్గదర్శి పాఠశాల నిర్వహకులు ప్రతి సంవత్సరం వేసవి సెలవుల్లో విద్యార్థుల కోసం ఉచితంగా వేసవి బడి నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వహకులతో పాటు ఉపాధ్యాయులు గంగాధర్, యోగా టీచర్ శ్రీనివాస రెడ్డి, హిందీ టిచర్ అనితా లక్ష్మి, బిఎస్. కుమారి, మమత విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థికచేయూత

బత్తలపల్లి : రైతుల నుండి కొనుగోలు చేసిన కనకాంబరాల పూలు ఇతర ప్రాంతాలకు తరలించడానికి బస్సుపై వేస్తున్న సమయంలో అదుపుతప్పి కింద పడి తీవ్ర గాయాలపాలైన బాధితుడు కాంతప్పకు పూలమండి యజమానులు ఆర్థిక చేయూతను అందించారు. మానవతా దృక్పథంతో రూ. 75 వేలను బాధితుడికి అందజేశారు. చేయూతనందించారు. ఈ కార్యక్రమంలో పూలమండి యజమానులు లక్ష్మీనారాయణ, నరిశెట్టి రామానాయుడు, సతీష్, రవి, శేఖర్, రామకృష్ణారెడ్డి, నారాయణస్వామి, శివయ్య, రామ్మోహన్ రెడ్డి,సాయి, తదితరులు పాల్గొన్నారు.

కీలక దశకు రాప్తాడు-ధర్మవరం సూపర్ లీగ్ క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి :కనగానపల్లి

పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న రాప్తాడు- ధర్మవరం సూపర్ లీగ్ మెగా క్రికెట్ టోర్నమెంట్ కీలక దశకు చేరుకుంది. గత ఆరు రోజులుగా జరుగుతున్న మ్యాచ్ లు మండలాల్లో క్వార్టర్ ఫైనల్స్ దశకు చేరుకున్నాయి. వివిధ గ్రామాల నుంచి వచ్చిన జట్లు ఉత్సాహంగా పోటీలలో పాల్గొంటున్నాయి. కనగానపల్లి మండలంలో 6వ రోజు మ్యాచ్‌లను ముత్తవకుంట్ల గ్రామంలో మాజీ మంత్రి పరిటాల సునీత మండల కన్వీనర్ యాతం పోతలయ్య మండల నాయకులతో కలిసి వీక్షించారు.

కెనరా బ్యాంక్ మేనేజర్‌గా ప్రహ్లాద

అమరాపురం : మండల కేంద్రంలోని కెనరా బ్యాంక్ బ్రాంచి మేనేజర్‌గా ప్రహల్లాద బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ మరిన్ని సేవలన అందిస్తామన్నారు. రైతు సోదరులు సమయపాలన పాటించి పంట రుణాలను రెన్యువల్ చేసుకోవాలని కోరారు.

పండ్ల తోటల రైతులను ఆదుకోండి

ప్రజాశక్తి బత్తలపల్లి

ప్రకృతి వైపరీత్యాలు, ఈదురు గాలులు, భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాలలో ఈదురు గాలులు, వర్షానికి దెబ్బతిన్న పండ్లతోటలను ధర్మవరం నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షులు చల్లా శ్రీనివాసులు నాయుడు,టిడిపి మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి లతో కలిసి గోనుగుంట్ల విజయ్ కుమార్ పరిశీలించారు. ఆయా గ్రామాలలోని బాధిత రైతులతో సాగు చేసిన పంటలు, పంట పెట్టుబడి, నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బత్తలపల్లి మండలంలోనే పండ్ల తోటలు సాగు చేసిన రైతులకు సుమారు రెండు కోట్ల రూపాయలకు పైబడి నష్టం వాటిల్లినట్లు తెలుస్తోందన్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టగా దిగుబడి చేతికందే సమయంలో అకాల వర్షాలు ఈదురుగాలులకు పంటలు తీవ్రంగా దెబ్బతిందన్నారు. పంటనష్టం కనులారా కనిపిస్తున్నా పంట నష్ట పరిహారం అందిస్తామనే మాట ప్రజా ప్రతినిధులు గాని, ప్రభుత్వం నుండి గాని వెలువడ లేదని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి బాధిత రైతులకు పంట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాల్యవంతం చౌదరి, నెట్టెం కృష్ణమనాయుడు, ఓబుల నాయుడు, రంగానాయుడు,వడ్డే పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

ముద్ర పథకంపై చేనేత కార్మికులకు అవగాహన

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణంలోని సాయినగర్ సచివాలయంలో బుధవారం చేనేత కార్మికులకు ముద్రపథకంపై అవగాహన కార్యక్రమాన్ని చేనేత జౌళిశాఖ జిల్లా ఎడి రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చేనేత కార్మికులకు ముద్రపథకం, నేతన్ననేస్తం. తదితర ప్రభుత్వపథకాల గురించి అవగాహన కల్పించారు. చేనేత కార్మికుల కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళిశాఖ అభివృద్ధి అధికారి రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు అవగాహన కల్పిస్తున్న చేనేత జౌళిశాఖ ఏడీరమేశ్

చంద్రబాబు వ్యాఖ్యలపై వైసిపి నిరసన

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

టిడిపి అధినేత చంద్రబాబు బడుగు బలహీన వర్గాలను కించపరిచే విధంగా చేసిన వ్యాఖ్యల పట్ల ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి నాయకులు నిరసన తెలిపారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని హనుమాన్ సర్కిల్‌లో చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా లక్షల మంది బడుగు బలహీన వర్గాలకు వైసీపీ ప్రభుత్వం గృహ నిర్మాణాలు చేపడుతోందన్నారు. చంద్రబాబు ఒక సెంటులో మృతదేహాలను పూడ్చుకోనేందుకు సరిపోతుందని బడుగులను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం అతని అహంకారానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో కొన్ని లక్షలు ఇల్లు నిర్మిస్తుంటే వైసిపికి ఎక్కడ పేరు వస్తుందోనని అసూయతో ఆ విధంగా మాట్లాడటం సరికాదన్నారు. బడుగులు బాగుపడటం చంద్రబాబుకు ఇష్టం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్లు రంగారెడ్డి, నరసారెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి, వైస్ చైర్మన్లు తిప్పన్న, శ్రీలక్ష్మి నాయకులు లోచర్ల విజయభాస్కర్ రెడ్డి, మాధవరెడ్డి, కేశప్ప, కౌన్సిలర్లు చెరువు భాస్కర్ రెడ్డి, సాయి గీత, సూర్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనలో పాల్గొన్న వైసిపి నాయకులు

పక్కాగా హౌస్ మ్యాపింగ్ సర్వే

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ఓటరు సర్వే హౌస్ మ్యాపింగ్ సర్వేను పక్కాగా నిర్వహించాలని టిడిపి పార్లమెంట్ అధికార ప్రతినిధి పురుషోత్తం గౌడ్ పేర్కొన్నారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి ఆదేశాల మేరకు పట్టణంలోపోలింగ్ బూత్‌లలో సెక్షన్ ఇన్‌ఛార్జిల నియామకం కోసం బుధవారం 95,37,39 వార్డులలో వార్డు కమిటిసభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పట్టణంలోని 104 పోలింగ్ బూత్‌లలో ఓటరు సర్వేహౌస్ మ్యాపింగ్ సర్వేను పక్కాగా నిర్వహించాలని షిఫ్టింగ్ ఓట్లను, మరణించినవారి ఓట్లను, దొంగ ఓట్లను ప్రత్యేకంగా గుర్తించి పట్టణ టీడీపీ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఓటరు జాబితాపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక లేనిపోని నిబంధనలను తెరపైకి తెచ్చి అర్హులైన లబ్దిదారులను సంక్షేమపథకాలకు దూరం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, నాగూర్ హుస్సేన్, బోయరవిచంద్ర, కొత్తపేటఆది, రహీంబాషా, తొగటనారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న నాయకులు

నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేయాలి

బుక్కపట్నం : రైతులకు సబ్సిడీ ద్వారా అందించే విత్తనాలను నాణ్యమైన వాటిని పంపిణీ చేయాలని ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, జిల్లా అగ్రి అడ్వైజర్ చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి కోరారు. ఈ మేరకు వారు సబ్సిడీ వేరుశనగ విత్తనాల నాణ్యతను బుధవారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన వేరుశనగను పంపిణీ చేయాలన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ, రైతు భరోసా సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేసి విత్తన రిజిస్ట్రేషన్, సబ్సిడీ పథకాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో మండల అగ్రి అడ్వైజర్ చైర్మన్ వెంకటచౌదరి, వ్యవసాయ శాఖ అధికారి సతీష్ బాబు, వీఆర్వో లక్ష్మీనారాయణ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరప్రసాద్, ఎఇఒలు సుధా, సునీత, రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

హిందూపురం : పురపాలక సంఘ పరిధిలోని14వ వార్డు పోచనపల్లిలో గత కొంత కాలంగా నీటి సమస్య నెలకొంది. ఈ విషయాన్ని ఆ ప్రాంత ప్రజలు వార్డు కౌన్సిలర్, వైస్ చైర్మేన్ బలరామిరెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన పెన్నా నది సమీపంలో బోరు బావి తవ్వించి, అక్కడి నుంచి పోచన పల్లి వరకు ప్రత్యేక పైప్ లైన్ ఏర్పాటు చేశారు. దీనిని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కనిపించని వ్యవసాయ శాఖ అధికారులు

ప్రజాశక్తి - తనకల్లు

మండలంలోని రైతులకు వ్యవసాయ పంటల సాగులో సలహాలు, సూచనలు ఇవ్వటంలో మండల వ్యవసాయ శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. మండల పరిధిలోని17 గ్రామ పంచాయతీల పరిధిలో ఎక్కువ శాతం మంది వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారు. వీరు సాగుచేసిన పంటలను సంరక్షించుకోవడానికి వాడే పురుగు మందులు, సస్యరక్షణ చర్యలు వాటిపై అవగాహన లేక అనేక మంది రైతులు నష్టపోతున్నారు. మండల పరిధిలోని బాలసముద్రం పంచాయతీలో బుగిడే చంద్ర అనే రైతు మూడు ఎకరాలలో బంగాళాదుంప పంట సాగు చేశారు. పంట ను ఆశించే తెగుళ్ళ, చీడ పీడ నివారణ కోసం సరైన అవగాహన లేక స్థానికంగా ఉన్న ఫర్టిలైజర్స్ షాపులలో అధిక ధరలు వెచ్చించి ందులు కొనలేక పొరుగున ఉన్న కర్ణాటక రాష్ట్రంలోని చేలూరు చింతామణి తదితర పట్టణాలకు వెళ్లి పురుగుమందులు ఎరువులు కొని తెచ్చుకొని తమ పంటలను కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. స్థానికంగా కొనలేక పక్క రాష్ట్రాలకు వెళ్లి కొనుకుంటున్నామని ఏ పంటకు ఏ మందులు వాడాలో తెలియడం లేదని బాధిత రైతు వాపోయాడు. ఎలాంటి సస్యరక్షణ చర్యలు తీసుకోవాలో వివరించే వ్యవసాయ అధికారులు తమ పంట పొలాలను ఏ రోజు సందర్శించలేదని ఆయన వాపోయాడు. తమకు తెలిసిన పరిజ్ఞానంతో షాపుల వారు ఇచ్చే మందులు తెచ్చుకొని వాటినే వాడుతున్నామన్నారు. అదే విధంగా మండల పరిధిలోని ఉస్తినిపల్లికి చెందిన దారం భాస్కర అనే రైతు తనకున్న 2 ఎకరాల పొలంతో పాటు కొంత పొలం కౌలుకు తీసుకొని అనప, బీన్స్, టమోటా, తదితర పంటలను సాగు చేశాడు. వివిధ రకాల పంటలు పండించిన కూడా గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నామని అదేవిధంగా సస్యరక్షణ చర్యల గురించి తమకు వివరించే వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని ఆయన విమర్శించాడు. అవగాహన లోపంతో మందుల దుకాణం వారు ఇచ్చిన సలహాలతో వారు సూచించిన మందులు వాడడం వలన పంట దిగుబడి తగ్గుతోందని వాపోయాడు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించకుండా రైతుల సమస్యలు తెలుసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామాల రైతులు విమర్శిస్తున్నారు. ఇదే విషయంపై స్థానిక మండల వ్యవసాయ అధికారి శ్రీహరి నాయక్‌ను వివరణ కోరగా మండల పరిధిలో ఏ రైతు తమ దృష్టికి ఏ సమస్యను తీసుకు రాలేదని అన్నారు. రైతులు తమను సంప్రదిస్తే పంట పొలాలను సందర్శించి వారికి కావాల్సిన సలహాలు సూచనలు అందిస్తామని తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న ఎరువుల దుకాణాలలో ప్రభుత్వం నిర్ణయించిన ధరల పట్టికను ఏర్పాటు చేయాలని మండల వ్యవసాయ అధికారి ని సిపిఎం నాయకులు శివన్న, శ్రీరాములు, రమణ, తదితరులు కోరగా తక్షణమే ఏర్పాటు చేయిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

స్పందన ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

హిందూపురం : పురపాలక సంఘ వ్యాప్తంగా స్పందనలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదులపై బుధవారం పట్టణంలో వివిధ వార్డుల్లో కమిషనర్ పర్యటించి, వాటిని పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రతి రోజు స్పందనలో వచ్చిన ఫిర్యాదులపై ప్రతి రోజు ఉదయం అధికారులతో కలిసి క్షేత్ర స్థాయి పరిశీలన చేసి వాటిని పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎసిపి ఆనంద్‌కుమార్, ఎఇ సురేష్ కుమార్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

బత్తలపల్లి : మండలంలోని తంబాపురం క్రాస్ వద్ద ఈనెల 19న ఆటో బోల్తా పడిన ప్రమాదంలో గాయపడిన ఓబులేసు బుధవారం మృతిచెందినట్లు బత్తలపల్లి పోలీసులు తెలిపారు.అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై మండల పరిధిలోని తంబాపురం క్రాస్ వద్ద ఈనెల 19న ఆటో బోల్తా పడిన సంఘటనలో నల్లబోయినపల్లికి చెందిన భార్యాభర్తలు ఓబులేసు, రామలక్ష్మమ్మ గాయపడ్డారు. వీరు అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మెరుగైన వైద్యం కొరకు బెంగళూరు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందారు.ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు బత్తలపల్లి పోలీసులు తెలిపారు.

నీటిమడుగులో పడి యువతి మృతి

ఓబుల దేవర చెరువు : మండల పరిధిలోని మిట్టపల్లిలో విషాదం చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు నీటిమడుగులో పడి ఆఫ్రిన్ (16) అనే యువతి మృతిచెందింది. పెద్దగుట్లపల్లి గ్రామానికి చెందిన రాజు సాబ్ ఇమాంబి బతుకుదెరువు కోసం బెంగళూరులో నివాసం ఉంటున్నారు. రాజుసాబ్ సోదరుడు బాబాసాహెబ్ ఇంట్లో జరుగుతున్న శుభకార్యానికి రాజు కుటుంబ సమేతంగా మిట్టపల్లికి వచ్చారు. మంగళవారం అనంతపురం జిల్లా నార్పల మండలం గుగుడు కుళ్లాయ స్వామిని దర్శించుకుని వచ్చారు. బుధవారం ఇంటి వద్ద ఉండగా రాజు సాబ్ కుమార్తె అఫ్రీన్ తోటి పిల్లలతో కలిసి సోమావతి నది ఒడ్డున ఉన్న ఆలయం వద్దకు వెళ్లింది.అక్కడున్న నీటిమడుగులో ప్రమాదవశాత్తు పడిపోయింది. గుర్తించిన పిల్లలు గ్రామస్తులకు సమాచారం చేరవేయడంతో హుటాహుటిన గ్రామస్తులు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే యువతి నీటిలో మునిగిపోయింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మృతురాలు అఫ్రిన్

బాధితులను పరామర్శించిన పల్లె : మిట్టపల్లి లో జరిగిన సంఘటన తెలుసుకున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి అక్కడికి చేరుకొని మృతదేహానికి నివాళు లర్పించి బాధితులను పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తనకల్లు : మండల పరిధిలోని మండ్లి పల్లి మిట్టమీద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. నల్లచెరువు మండల పరిధిలోని మారిశెట్టిపల్లికి చెందిన రమణప్ప అనే వ్యక్తికి కాలు విరిగింది. అలాగే ఓరువాయి గ్రామానికి చెందిన ఎల్లప్ప అనే వ్యక్తి స్వల్పంగా గాయపడ్డాడు. తక్షణమే అటుగా వెళుతున్న బాలసముద్రం ఎంపీటీసీ అమర్ కార్తికేయ స్పందించి క్షతగాత్రులను తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రమణప్పను కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా

బత్తలపల్లి : గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, చిన్న చిన్న సమస్యలు, గొడవలను నివారించాలని ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు సిఐ, ఎస్ఐలకు సూచించారు. బుధవారం రాత్రి బత్తలపల్లి పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ తనిఖీ చేశారు. స్టేషన్లోకేసుల వివరాలు, సీడీ ఫైల్, పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐ మన్సూరుద్దీన్, ఎస్ఐ టీవీ శ్రీహర్ష తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అధికారులతో మాట్లాడుతున్న డీఎస్పీ

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

కదిరి టౌన్ : గాండ్లపెంట మండలం, మలమీద పల్లి పంచాయతి కర్లవరిపల్లికి చెందిన బేల్దారి వీరనారాయణ ప్రమాదవశాత్తూ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్. బత్తల హరిప్రసాద్ సీనియర్ నాయకులు డాక్టర్.వెంకటరమణ చేతుల మీదుగా రూ. 10వేలను మృతుని కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమణ, హరి, రామకృష్ణ, వెంకటేష్, మల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిపిఎస్‌ను రద్దు చేయాలి

కదిరి టౌన్ : అధికారంలోకి రాగానే సిపిఎస్ రద్దు చేస్తామని జగన్ ఉద్యోగులు ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ రద్దు చేయాలని ఏపీ కాంగ్రెస్ కమిటీ ఆర్గనైజేషన్ సెక్రటరీ ఇందాదుల్లాఖాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి ప్రభుత్వ ఉద్యోగస్తులను మోసం చేశారని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగులకు వేతనం ఇవ్వలేని ముఖ్యమంత్రి రెండు కోట్ల రూపాయల అప్పు చేసి ఏం చేశారో లెక్కల చూపించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగస్తులకు నెల నెల వేతనం ఇవ్వలేని ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగస్తులకి హెచ్ ఆర్ 16 శాతం ఇస్తూ కాంట్రాక్ట్ బేసిక్ కింద పని చేస్తున్న వారికి రెగ్యులర్ చేయకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తహశీల్దార్‌కార్యాలయం దగ్గర నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

అమడగూరు : కదిరి పట్టణం వాణి వీధిలో ఉన్న షిరిడీ సాయిబాబా దేవాలయములో గురువారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ మట్టా చెన్నరాయ శెట్టి తెలిపారు. చక్కెర వ్యాధి, బీపితో పాటు ఇతర వ్యాధులతో బాధపడుతున్నా వారికి రక్త పరీక్షలతో పాటు వైద్యం చికిత్సలు చేసి ఉచితంగా మందులు ఇస్తామన్నారు. ప్రతి నెల చివరి గురువారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

29 నుంచి పాలిసెట్ సర్టిఫికెట్ల పరిశీలన

ప్రజాశక్తి-హిందూపురం

పాలీ సెట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఈ నెల 29 నుంచి స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో పాలీసెట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎన్.హరీష్ బాబు బుధవారం తెలిపారు.

ప్రభుత్వం, ప్రజలకు మధ్య వారధులు వాలంటీర్లు

పెనుకొండ, కదిరిలో జరిగిన వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, తదితరులు

వాలంటీర్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్సీ

ప్రజాశక్తి -పెనుకొండ

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా వాలంటీర్లు చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే శంకర్ నారాయణ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయం ముందు వున్న పాఠశాల ఆవరణంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి, వివక్షకు తావు లేకుండా సేవలు అందిస్తున్న వాలంటీర్ల సేవలు గుర్తించి ప్రభుత్వం ప్రోత్సాహకంగా అవార్డులు అందిస్తోందని తెలిపారు. వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆశయ సాధనకు వాలంటర్లు చేస్తున్న సేవలు గొప్పవన్నారు. వీరు మరింత బాధ్యతగా పనిచేయాలన్నారు. అనంతరం వాలంటీర్లను ఎమ్మెల్యే సత్కరించారు. ఈ కార్యక్రమంలో నగరపంచాయతీ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ, ఛైర్మన్ ఫరూక్, వైస్ చైర్మన్ సునీల్, కౌన్సిలర్లు, వైసిపి నాయకులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పనిచేసే వాలంటీర్ల సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. బుధవారం మండల పరిధిలోనిఆయా గ్రామ సచివాలయాల పరిధిలో విధులు నిర్వహిస్తున్న గ్రామ వాలంటీర్లలో ఉత్తమ సేవలు అందించిన వారికి సేవ మిత్ర, సేవ రత్న, సేవ వజ్ర, పురస్కారాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నరేంద్రకుమార్, హిందూపురం రూరల్ మండల జడ్‌పిటిసి నాగభూషణం, వైస్ ఎంపీపీ, రఘునాథ్ రెడ్డి, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు వాలంటీర్లు మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాలంటీర్ల వ్యవస్థ ద్వారా ఇంటి ముందుకే సంక్షేమ ఫలాలు అందుతున్నాయని స్థానిక ఎమ్మెల్యే సిద్దారెడ్డి పేర్కొన్నారు. ఉత్తమ సేవలందించిన వాలంటీర్లకు నిర్వహిస్తున్న వాలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని స్థానిక మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేపట్టిన ప్రతి సంక్షేమ కార్యక్రమం సచివాలయ, వాలంటీర్ వ్యవస్థల ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దకే అందజేస్తున్నామన్నారు. వాలంటీర్ల సేవలను గుర్తించిన ప్రభుత్వం ప్రతి ఏడాది అవార్డులతో సత్కరిస్తోందన్నారు. ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమంలో వాలంటీర్లు ముందుండాలని వాలంటీర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.